

మహాత్ములారా... మన్నించండి

పుంగనూరులో మరుగునపడిన మహనీయుల విగ్రహాలు

రోడ్డు విస్తరణతో పక్కన పడేసిన వైనం



పుంగనూరు, జూలై 13: పుంగనూరులో మహనీయుల విగ్రహాలు నిరాదరణకు గురయ్యాయి. రోడ్డు పక్కన మరుగునపడ్డాయి. పుంగనూరు ఇందిరాసర్కిల్‌లో గతంలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. మహిళోద్ధరణకు కృషి చేసి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాన్ని 2009 జనవరి 23వ తేదీ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడి హోదాలో చిరంజీవి ఆవిష్కరించారు. అప్పటి నుంచి బీసీ కుల సంఘాల నేతలు ఆయన జయంతి, వర్ధంతి రోజున ఇక్కడ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. అలాగే రామాయణం రచించిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని 2022 అక్టోబరు 9వ తేదీన వాల్మీకులు ఏర్పాటు చేయగా, నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితల నడుమ తెలుగుతల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. చిత్తూరు-మదనపల్లె ప్రధాన మార్గంలోని ఇందిరాసర్కిల్‌లో ఈ మూడు విగ్రహాలను ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు. నాలుగు నెలల క్రితం పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నేషనల్ హైవే, మున్సిపల్ అధికారులు ఈ విగ్రహాలను తొలగించి, రోడ్డుపక్కన ప్లాట్‌ఫాంపై పెట్టేశారు. రోడ్డు పనులు పూర్తయినా అధికా రులు విగ్రహాలు ఏర్పాటు చేయకుండా మీనవేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిం చాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ఇందిరా సర్కిల్‌లో ప్లాట్‌ఫాంపై మరుగునపడిన జ్యోతిరావుపూలే, వాల్మీకి మహర్షి విగ్రహాలు

మంచుకొండల్లో పలమనేరు ఖ్యాతి


సైకిల్లో లడఖ్ చేరుకున్న యువకుడు

సేవ్ ట్రీ..సేవ్ ఫారెస్టు నినాదంతో 32 రోజుల యాత్ర

పలమనేరు, జూలై13 : పలమనేరు యువకుడు 32 రోజుల పాటు సైకిల్‌లో ప్రయాణించి లడఖ్ సమీపంలోని మంచుకొండలకు చేరుకుని అరుదైన రికార్డు సృష్టించాడు. చెట్లను, అడవులను ఇష్టానుసారం నాశనం చేస్తుండడంతో దానివల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో పాతపేట శ్రీనగర్ కాలనీకి చెందిన మస్తాన్ బాషా కుమారుడు ఎస్.బషీర్ భావించాడు. ఈ మేరకు 32 రోజుల క్రితం పలమనేరు నుంచి సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ నెల 12వ తేదీ లడఖ్ చేరుకుని, అక్కడి మంచుకొండలను అధిరోహించాడు. తాను అనుకున్న లక్ష్యం పూర్తయిందని, ఇందులో స్నేహితులు, సన్నిహితులు ఆర్థికంగా సాయపడ్డారని బషీర్ తెలిపారు. జిల్లా నుంచి ఈ మంచుకొండలు ఎక్కిన మొదటి వ్యక్తిగా కీర్తి గడించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈనెల 17వ తేదీన రైలులో జిల్లాకు చేరుకుని కలెక్టర్‌ను కలుస్తానని ఆంధ్రజ్యోతితో చెప్పారు.



మంచుకొండ వద్ద..



లడఖ్ చేరుకున్న బషీర్

సైకిల్‌పై వెళ్తున్న బషీర్

16న పాఠశాలలకు సెలవు

చిత్తూరు (సెంట్రల్), జూలై 13: మొహర్రం సందర్భంగా ఈనెల 16న జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ఇస్తున్నట్లు డీఈవో దేవరాజు తెలిపారు. ఆగస్టు 16 వరలక్ష్మీ వ్రతం, నవంబరు 15న కార్తీక పౌర్ణమి, డిసెంబర్ 24న క్రిస్టమస్ ఈవ్, 2025 జనవరి ఒకటిన ఆంగ్ల కొత్త సంవత్సరం సందర్భంగా స్థానిక సెలవు దినాలుగా నిర్ణయించినట్లు చెప్పారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డీఈవో కార్యాలయంలో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు, స్టూడెంట్ కిట్ల పంపిణీ, అటెండెన్స్ యాప్ వినియోగం, ఎండీఎం తదితర అంశాలపై చర్చించారు.

రెస్కో ఎండీగా సోమశేఖర్

కుప్పం, జూలై 13: కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ) ఎండీగా ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.సోమశేఖర్ నియమితులయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో రెస్కోలో అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. వాటిపై ప్రస్తుతం విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతిపై దృష్టి పెట్టింది. జేసీ పి.శ్రీనివాసులును రెస్కో పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించింది. ఇప్పుడు నేరుగా ఎండీగా తిరుపతి ఎస్పీడీసీఎల్ ఈఈ సోమశేఖర్‌ను నియమిస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఈనెల 12న ఉత్తర్వులు విడుదల చేశారు. సోమశేఖర్ 2025 మే 31వ తేదీదాకా రెస్కో ఎండీగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తారు.

బడి బస్సులు భద్రమేనా...?

- పాఠశాలలు ప్రారంభమైనా పూర్తికాని ఫిట్నెస్ పరీక్షలు
- కాలం చెల్లిన బస్సులతో కాలం గడుపుతున్న యాజమాన్యాలు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

చిత్తూరు సిటీ, జూలై 13: బడి బస్సుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులవుతున్నా ఫిట్నెస్ పరీక్షలు పూర్తికాక పోవడం విమర్శలకు తావిస్తోంది. సాధారణంగా మే చివరి వారంలో ప్రతి విద్యాసంస్థ వాహనం ఫిట్నెస్ సర్టిఫికెట్ కాలపరిమితి ముగుస్తుంది. ఆ వెంటనే ఆ వాహనానికి మరమ్మతులు పూర్తి చేసి ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందాలి. చాలా విద్యా సంస్థల యాజమాన్యాలు అలా చేయకుండానే విద్యార్థులతో బస్సులను రోడ్డపైకి తీసుకువస్తున్నారు.

నిబంధనలు ఇలా..

పిల్లల భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి బడి బస్సుల ఫిట్నెస్ విషయంలో రవాణా శాఖ గతంలో కంటే కఠినంగా నిబంధనలు రూపొందించింది.

- బస్సు పసుపురంగులోనే ఉండాలి.
- ఎడమవైపు విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబరు, చిరునామా స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు అటెండర్, టీచర్, పేరెంట్స్ మానిటరింగ్ సభ్యులుండాలి.
- బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల సమాచారం ఉండాలి.
- సామర్థ్యానికి మించి ఎక్కించ రాదు.
- ప్రథమ చికిత్స పెట్టె, అందులో మందులుండాలి.
- ఇంజన్ కంపార్టుమెంట్లో అగ్నిమాపక యంత్రం, పొడి ఉంచాలి.
- పర్మిట్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితర పత్రాలు తప్పనిసరిగా ఉండాలి.
- విద్యార్థుల బ్యాగులు పెట్టుకోవడానికి ప్రత్యేక షెల్ఫులు ఏర్పాటు చేయాలి.
- డ్రైవర్‌కు 60 సంవత్సరాలు మించరాదు. అదే క్యాటగిరి బస్సును ఐదేళ్ల నడిపిన అనుభవం ఉండాలి.
- డ్రైవర్, అటెండర్ యూనిఫాం ధరించాలి.
- బస్సు బయలుదేరే ముందు డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించాలి.

నిబంధనలకు భయపడే...

ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు బడి బస్సుల యాజమాన్యాలకు కంటగింపుగా మారింది. ఫిట్నెస్‌కు వెళితే లోపాలు వెలుగుచూస్తాయనే భయంతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సుమారు 980 పాఠశాల బస్సులున్నాయి. అందులో ఇప్పటివరకు 900 బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. మిగిలిన 80 ఇంకా చేసుకోలేదు.

పాఠశాల బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం

పాఠశాల బస్సులపై తరచూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం.. నెల రోజుల్లో నిబంధనలు పాటించని 24 బస్సులపై కేసులు నమోదు చేసి, 8 సీజ్ చేశాం. ఫిట్నెస్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. భారీ జరిమానాతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తున్నాం. విద్యార్థులను చేరవేసే ఆటోలనూ తనిఖీ చేస్తున్నాం. పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తాం.

\- నిరంజన్ రెడ్డి, డీటీసీ





పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

టమోటా @ రూ.64

వర్షాలకు పంట దెబ్బతినడంతో పెరిగిన ధర

పలమనేరు, జూలై13 : టమోటా ధర శనివారం స్వల్పంగా పెరిగింది. పలమనేరు మార్కెట్ యార్డులో ఈ నెల 12వ తేదీ కిలో రూ.50 పలుకగా 13న గరిష్ఠంగా రూ.54 పలికింది. పుంగనూరు మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.53, మదనపల్లెలో మొదటి రకం గరిష్ఠంగా రూ.64 పలికింది. వర్షాల కారణంగా తోటల్లో టమోటాలు దెబ్బతింటుండటంతో ధర పెరిగినట్లు తెలుస్తోంది. ధర పెరగడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తిరుపతిలో ఎస్పీలతో సమావేశమైన డీజీపీ

సమన్యాయం..మన విధానం

బాధితులకు అండగా నిలవండన్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

తిరుపతి (నేరవిభాగం), జులై 13 : 'పోలీసుల పని విధానం మారాలి. గతంలో చాలామందిపై ఫిర్యాదులొచ్చాయి. మానవ హక్కులు ఉల్లంఘించి, చట్టాలను చేతిలోకి తీసుకుని పనిచేసిన వారు ఇక మారాలి. లేకుంటే వారు తప్పుకోవచ్చు... మళ్ళీ మళ్ళీ అదే విధానాలు అమలుచేయాలంటే నా దగ్గర కుదరదు...ఎవరు తప్పు చేసినా అందరికీ సమన్యాయం అనే విధానం మరచిపోవద్దు' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. శాంతి భద్రతలు, నేరాల అదుపు, ప్రస్తుతం పోలీసు అధికారుల పనితీరు వంటి అంశాలపై రాయలసీమ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, డీఐజీ షెముషి బాజ్పేయితో శనివారం తిరుపతిలో డీజీపీ సమీక్షించారు. ప్రధానంగా కొత్త ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి బాధితులకు తక్షణం న్యాయం చేయాలని ఆదేశించారు.చట్టాలను చేతిలోకి తీసుకుని మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే మాత్రం ఎవరైనా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బాధితులు, ఫిర్యాదుదారులు స్టేషన్లకు వచ్చినప్పుడు వారితో నవ్వుతూ, స్నేహపూర్వక వాతావరణంతో మాట్లాడాలని కోరారు. తిరుపతిలో ఎన్నికలకు ముందు, కౌంటింగ్ అనంతరం జరిగిన కొన్ని కేసులను ఉదహరిస్తూ ఇలాంటి తప్పుడు కేసులు పెడితే మాత్రం సంబంధిత అధికారులపై చర్యలు వుంటాయన్నారు. ప్రస్తుతం తిరుపతిలో నేరాలు, ఎర్రచందనం అక్రమ రవాణా కొంతవరకు తగ్గుముఖం పట్టాయంటూ ఎస్పీ హర్షవర్ధన రాజు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న విధానంపై డీజీపీ అభినందించారు.తిరుపతిలో గంజాయి విక్రయాలు ఎక్కువగా వున్నాయని, వాటిని అరికట్టాలన్నారు.గంజాయి సేకరణ,రవాణా, విక్రయాలపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పాత కేసులు, ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులు, గత ప్రభుత్వంలో అధికారపార్టీతో అంటకాగిన అధికారుల పనితీరుపై ఆయన సమీక్షించారు.ఎస్పీలు హర్షవర్ధన రాజు, కృష్ణారావు, కృష్ణకాంత్, సిద్ధార్థకౌశల్, మాధవ రెడ్డి, మణికంఠ చందోలు, గౌతమి శాలి, తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ పాల్గొన్నారు.

రెస్కో విచారణాధికారిగా శ్రీలక్ష్మి

కుప్పం, జూలై 13: కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ) విచారణాధికారిగా సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఈ ఏడాది జూన్ 24వ తేదీన ఆమెను ఈ విధుల్లో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆమె ఈనెల 11వ తేదీన రెస్కో ఎండీకి లేఖ రాశారు. 2019-20 సంవత్సరపు సంస్థ ఆడిట్ నివేదిక, సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ద్వారా తన దృష్టికి వచ్చిన అవకతవకలు, చేసిన ఆరోపణలు, పి.మనోహర్ అప్పట్లో చేసిన ఫిర్యాదు, ఇతర అక్రమాలు, ఆరోపణలపై విచారణ చేసే అధికారం తనకు దక్కినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. రెస్కో బైలా, సర్వీస్ బైలా కాపీలు, 2010 నుంచి చేసిన సవరణల వివరాలు తేదీలు, ఆర్డర్లు, లైసెన్సులు, విద్యుత్తు సరఫరా, 2019 నుంచి సంవత్సరాల వారీగా బడ్జెట్లు, క్యాడర్ స్ట్రెంత్, పదోన్నతులు, జనర్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు, ప్రాజెక్ట్ ఇంజినీరు పి.సుబ్రమణ్యం సర్వీస్ వివరాలు, సిబ్బంది జీతభత్యాల పెంపు, గ్రాట్యుటీల చెల్లింపు తదితర సర్వ వివరాలతో కూడిన ఫైళ్ల తనకు సమర్పించాలని లేఖలో కోరారు. కుప్పం రెస్కో కార్యాలయంలో ఈనెల 18వ తేదీన తాను చేపట్టబోయే విచారణకు రెస్కో ఎండీతో సహా సంబంధిత అధికారులు, ఇతర సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ఆగని గజ బీభత్సాలు

టమోటా, మామిడి పంటలకు తీవ్ర నష్టం



పేటూరు వద్ద ఏనుగులు విరిచేసిన మామిడి చెట్టు

సోమల, జూలై 13: మండలంలో ఏనుగుల దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. శుక్రవారం రాత్రి అన్నెమ్మగారిపల్లె, పేటూరు గ్రామాల సమీపంలోని టమోటా, మామిడి తోటల్లో స్వైరవిహారం చేశాయి. బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పేటూరుకు చెందిన రైతు చిట్టి మామిడి, టమోటా తోటల్లో పండ్లను తిన్నంతా తిని ఊతంగా నాటిన కర్రలను ధ్వంసం చేసి, డ్రిప్ పరికరాలను తొక్కి, నాశనం చేశాయి. చిన్నఉప్పరపల్లె పంచాయతీ చీకలవారిపల్లెకు చెందిన మునీశ్వరరావు టమోటా తోటలో రూ.2లక్షల మేర పంట నష్టం జరిగింది. గురికానివారిపల్లెకు చెందిన నక్కింటి శంకరయ్య టమోటా తోటలో తీవ్ర నష్టం జరిగింది. నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు సంచారంతో రైతులు జట్లుగా ఏర్పడి సొంత ఖర్చులతో టపాసులు పేల్చుకుంటూ, డప్పుల శబ్దం చేస్తూ పొలాల వద్ద జాగారం చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

జిల్లా అంతటా వాన

అత్యధికంగా రామకుప్పంలో 44.8 మి.మీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వాన కురిసింది. రొంపిచెర్ల మినహా మిగిలిన 31 మండలాల్లో తేలిక పాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా రామకుప్పంలో 44.8మి.మీ, అత్యల్పంగా సదుంలో 1.0 మి.మీ నమోదైంది. విజయపురం 41.8, నింద్ర 37.4, పుంగనూరు 35.2, కార్వేటినగరం 34.2, పాలసముద్రం 31.4, శ్రీరంగరాజపురం 30.6, వెదురుకుప్పం 30.2, ఐరాల 27.4, పూతలపట్టు 22.4, చిత్తూరు రూరల్ 21.6, నగరి 21.2, గుడిపాల 20.4, పులిచెర్ల 19.0, చౌడేపల్లి 17.8, చిత్తూరు అర్బన్ 17.8, బంగారుపాళ్యం 17.4, గంగాధరనెల్లూరు 15.2, యాదమరి 13.4, కుప్పం 12.2, పెనుమూరు 12.0, వి.కోట 10.0, తవణంపల్లె 9.6, పెద్దపంజాణి 8.4, పలమనేరు 8.0, గంగవరం 7.2, సోమల 6.6, బైరెడ్డిపల్లి 6.2, శాంతిపురం 2.8, గుడుపల్లిలో 2.6 మి.మీ కురిసింది.

టీడీపీ నేత కుమారుడిపై వైసీపీ దాడి

రామకుప్పం, జూలై 13: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ ననియాలకు చెందిన టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్ కుమారుడు చరణ్‌సాయిపై స్థానిక వైసీపీ సర్పంచు భర్త వైసీపీ నేత గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్ శనివారం సాయంత్రం మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. మనోహర్ రామకుప్పం పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు...మనోహర్, అతని సోదరుడు గజేంద్ర శనివారం మధ్యాహ్నం సొంత పనుల కోసం తమిళనాడు రాష్ట్రం వానియంబాడి పట్టణానికి వెళ్లారు. సాయంత్రం ఐదు గంటలకు గ్రామానికి చెందిన రాజశేఖర్, వేణు, రమేష్‌లు వారికి ఫోన్ చేసి చరణ్‌సాయిపై గోవిందప్ప, సతీష్, మురుగేష్ దాడి చేస్తున్నారని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న చరణ్‌సాయిని గ్రామస్తులు కుప్పం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ననియాలకు చేరుకున్న మనోహర్, గజేంద్ర ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. తాను పొలం వద్ద నడుచుకుని వెళ్తుండగా కత్తులు, గడ్డపార, ఇనుపరాడ్లతో కొట్టి కాళ్లతో తన్ని, చిత్రహింసలు పెట్టారని చరణ్‌సాయి తెలిపాడు. రాజశేఖర్, రమేష్, వేణులు వచ్చి కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపాడు. గోవిందప్ప గతంలోనూ తమ కుటుంబంపై కక్షతో దాడులకు పాల్పడ్డాడని, చర్యలు తీసుకోవాలని మనోహర్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ




ఐరాల(కాణిపాకం),జూలై13: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది.వరసిద్ధుడి దర్శనార్థం వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఉదయానికే క్యూలన్నీ పూర్తిగా నిండి పోయాయి. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

కూలిన పురాతన రావివృక్షం



కార్వేటినగరం, జూలై 13: కార్వేటినగరం స్కంద పుష్కరిణి వద్ద పురాతన రావి చెట్టు శుక్రవారం రాత్రి కూలిపోయింది. దీని వయస్సు 350 సంవత్సరాలు ఉంటుందని, కార్వేటినగరం సంస్థానాధీశుల కాలం నుంచి ఉందని స్థానికులు తెలిపారు. రావిచెట్టులో కొంతభాగం ఇటీవల కూలిపోయింది. తాజాగా చెట్టు మొదలు భాగం చెదలు పట్టేయడంతో రెండుగా చీలి పక్కనే ఉన్న ఉమాతంగమేశ్వర ఆలయ పైకప్పుపై పడింది.

పంచాయతీలకు నిధులు విడుదలపై సీఎంకు కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదం అందిస్తున్న చుక్కా ధనుంజయ యాదవ్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి రూ.250 కోట్లు విడుదల చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన సీఎం చంద్రబాబుకు సర్పంచ్ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ ఇతర ప్రతినిధులతో కలిసి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధనుంజయ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేర నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. బకాయి ఉన్న మిగతా నిధులు త్వరగా విడుదల చేయాలని ఆయన సీఎంను కోరారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి డేగల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

డీసీసీబీ నిధుల దుర్వినియోగ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన అవినీతి అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవినీతి, సింగిల్ విండోల్లో జరిగిన డీపీడీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మేనేజర్ యుగంధర్‌లతో కలసి శనివారం ఈ మేరకు జేసీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. డీసీసీబీలో పెద్దఎత్తున అవినీతి అక్రమాలు జరిగినట్లు వార్తలొచ్చాయన్నారు. ముఖ్యంగా రుణపంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలకు, అనర్హులకు రుణాలు మంజూరు చేసి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. జేఎల్‌జీ రుణాలు కూడా పక్కదారి పట్టినట్లు వార్తలు వచ్చాయన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ప్రోత్సాహంతోనే బ్యాంకులో ఇన్ని అక్రమాలు జరిగాయని, ఇందులో కొందరు బ్యాంకు ఉద్యోగులు కూడా పాత్రధారులై ఉన్నారని అన్నారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాల రద్దు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. 16వ తేదీన ఆలయంలో ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈక్రమంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో వీఐపీ బ్రేక్ దర్శనాలకు 15వ తేదీన ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

స్విమ్స్‌లో డీఈవో పోస్టుకు 20న ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), జూలై 13: స్విమ్స్ వైరాలజీ విభాగంలో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో) పోస్టుకు ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు 35 ఏళ్ల లోపువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో 20తేదీ ఉదయం 8 గంటలకు స్విమ్స్ కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

తిరుపతి ఎస్పీగా సుబ్బరాయుడు

హర్షవర్ధన రాజు కడపకు బదిలీ



సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జులై 13 : తిరుపతి జిల్లాకు ఎస్పీగా ఎల్. సుబ్బరాయుడు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా బండమీదపల్లెకు చెందిన సుబ్బరాయుడు 2007లో డీఎస్పీగా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం, ఏలూరుల్లో డీఎస్పీగా పనిచేసిన తర్వాత నిజామాబాద్, అనంతపురం ,కరీంనగర్ జిల్లాల్లో అదనపు ఎస్పీగా పనిచేశారు. 2013లో ఐపీఎస్ హోదా లభించింది. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి గవర్నర్ వద్ద సీఎస్‌ఓగా పనిచేశారు.2014 నుంచి 2019 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసి మంచి అనుభవం గడించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక తెలంగాణా క్యాడర్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ సీఐడీలో ఎస్పీగా పనిచేశారు.2023లో కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఆయన్ను ఎన్నికల సమయంలో డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆయన్ను హైదరాబాదు ట్రాఫిక్ డీసీపీగా నియమించారు. అక్కడ పనిచేస్తూ ఏపీకి డిప్యుటేషన్‌పై రావడానికి దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల క్రితం ఏపీకి ఇంటర్ క్యాడర్ బదిలీపై వచ్చిన సుబ్బరాయుడు తాజాగా తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమితులయ్యారు. అలాగే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బరాయుడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఎస్పీ హర్షవర్ధన రాజును కడపకు బదిలీ చేశారు.ఆయన ఇక్కడ పని చేసిన రెండు నెలల వ్యవధిలోనే పోలీసు శాఖను గాడిలో పెట్టడానికి కృషి చేశారు. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యసేవనాన్ని అరికట్టేందుకు ప్రయత్నించారు.

తిరుమల క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసిన ఇద్దరిపై కేసు నమోదు



వీడియోలో మాట్లాడుతున్న వాసన్

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఇద్దరిపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవారి దర్శనం కోసం నారాయణగిరి షెడ్‌లోని కంపార్టుమెంట్‌లో భక్తులు వేచివున్న సందర్భంలో ఓ యువకుడు తాళాలు తీస్తున్నట్టు నటించగా భక్తులందరూ తాళాలు తీస్తున్నారనే భ్రమలో పైకిలేచి గోవిందనామస్మరణలు చేశారు. ఈ లోగా ఆ యువకుడు వెకిలినవ్వులతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దృశ్యాలను 'టీటీఎఫ్ ఫ్యామిలీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో పోస్టు చేయగా, ఈ ప్రాంక్ వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయంలో 11వ తేదీన మీడియాలో రావడంతో టీటీడీ స్పందిస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో టీటీడీ సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు టీటీఎఫ్ పేజ్‌ను నడుపుతున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన వి.వైకుంఠవాసన్, అతని స్నేహితుడు గోవిందరాజ రామస్వామి అనే యువకులపై తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా, ప్రాంక్ వీడియో చేసిన వ్యక్తుల కోసం ఓ బృందం తమిళనాడుకు వెళ్లింది. తొలత వైకుంఠవాసన్, గోవిందరాజ స్వామిని అదుపులోకి తీసుకుని ఆ తర్వాత ప్రాంక్ వీడియో చేసిన మిగిలినవారిని కూడా అదుపులోకి తీసుకునేందుకు భద్రతాధికారులు ప్రయత్నిస్తున్నారు.

వీడియో తీసినందుకు క్షమించండి: వాసన్

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వీడియో ఉంటే తనను క్షమించాలంటూ ప్రాంక్ వీడియో పోస్ట్ చేసిన పేజ్ క్రియేటర్ వాసన్ శనివారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. తాను తన స్నేహితులతో కలిసి భక్తిభావంతోనే తిరుమలకు వచ్చామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయంలోకి ఫోన్ తీసుకెళ్లానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందు తమ సెల్‌ఫోన్లను డిపాజిట్ చేశామన్నారు. అయితే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందున్న నారాయణగిరి షెడ్లలో తమ స్నేహితులతో సరదాగా ఓ వీడియో చేశామని, ఈ వీడియో తప్పుగా ప్రజల్లోకి వెళ్లిపోయిందన్నారు. నిజానికి అది ప్రాంక్ కాదని, తాము కంపార్టుమెంట్లలో వేచి ఉన్నప్పుడు కొందరు ఉద్యోగులు తాళాలు తీస్తున్నట్టు దగ్గరకు వచ్చి వెళ్లిపోయారని, దాన్నే తాము సరదాగా రీక్రియేట్ చేశామని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. కానీ వీడియో చాలా తప్పుగా వైరల్ అయ్యిందని, ఈ వీడియో వల్ల ఎవరి మనసైనా కష్టపడి ఉంటే క్షమించాలని కోరాడు. కులాలు, మతాలపై తమకు ఆసక్తి లేదని, అందులో భాగంగానే ఇతర మతానికి చెందిన తనస్నేహితుడు అజీస్ కూడా స్వామి దర్శనానికి వచ్చాడని తెలిపాడు.

టీటీడీ సీవీఎస్వో బదిలీ



తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారి(సీవీఎస్వో) డి.నరసింహకిషోర్ బదిలీ అయ్యారు. 2022 ఏప్రిల్ 6వ తేదీన బాధ్యతలు స్వీకరించిన నరసింహకిషోర్ రెండేళ్ల మూడునెలల పాటు టీటీడీలో పనిచేశారు.తూర్పు గోదావరి జిల్లాకు ఆయన్ను బదిలీ చేశారు. అయితే ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. తిరుమలలో భద్రతావైఫల్యంపై ఈ రెండేళ్లలో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా టీటీడీ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఓ డ్రోన్ కెమెరా నేరుగా ఆలయం పైకే వెళ్లడం కలకలం సృష్టించింది. గత ఏడాది జనవరిలో అఖిలాండం నుంచి శ్రీవారి ఆనందనిలయం వరకు తీసిన డ్రోన్ విజువల్స్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. సర్వే కోసమని ఓ సంస్థకు అనుమతి ఇచ్చి పర్యవేక్షణను గాలికొదిలేయడంతో ఆ సంస్థ ఉద్యోగి డ్రోన్ ద్వారా వీడియో తీసి నెట్‌లో అప్‌లోడ్ చేశాడు. అలాగే గత ఏడాది మే నెలలో ఓ యువకుడు భద్రతాతనిఖీలు దాటుకుని ఆలయంలోకి వెళ్లి ఆనందనిలయం వీడియోను తీసి సోషల్‌మీడియాలో పెట్టాడు. ఈ ఏడాది కూడా ఓ జంట డ్రోన్ కెమెరాలతో తిరుమలకు రావడమే కాకుండా ఘాట్‌రోడ్డులో వీడియోను తీయడం కూడా విమర్శలకు దారితీసింది. మరోవైపు గతంలో ఎన్నడూ లేనివిధంగా తిరుమలలో గంజాయి పట్టుబడటం కూడా అందరినీ ఆశ్చర్యపరిచింది.తిరుమలలో నిషేధించిన మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు కూడా తరచూ దర్శనమిచ్చాయి. ఈ పరిస్థితుల్లో తిరుమలలో భద్రతను మరింత పటిష్ఠం చేయడంలో భాగంగా ఎవరిని సీవీఎస్వోగా నియమిస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఆరుగురికి గాయాలు




మృతి చెందిన ఉపేంద్రాచారి, వైన్ షాపు పరిసరాలలో మృతి చెందిన వ్యక్తి

ఐరాల(కాణిపాకం), జూలై 13: కాణిపాకం పోలీసు స్టేషన్ పరిధిలోని చిగరపల్లె హైవే వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసి మృతి చెందగా, ఆరుగురు గాయపడినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన ఉపేంద్రాచారి తన స్నేహితులు ఏడుగురితో కలసి సొంత వాహనంలో శుక్రవారం బయల్దేరి శనివారం తిరుపతి వచ్చారు. శ్రీవారి దర్శనానికి సమయం ఉండటంతో వీరు కాణిపాకం వరసిద్ధుడి దర్శనానికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొనగా, వెనక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపేంద్రాచారి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం సీఎంసీకి తరలించారు. స్వల్పంగా గాయపడిన సురేష్‌గౌడ్, మధుబాబు, ఒప్పలయ్య, మహేందర్, గంగాధర్‌లు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాహనాన్ని నడుపుతున్న మధుబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాణిపాకంలోని ఓ వైన్ షాపు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గళ్ల చొక్కా ధరించినట్లు పేర్కొన్నారు.

రాజనాలబండ పంచాయితీలో ఇరువర్గాల ఘర్షణ

● ఒకరికి విరిగిన కాలు ● మరో ఇద్దరికి తీవ్రగాయాలు





దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు, కాలు విరిగిన ప్రభాకర్‌రెడ్డి, గాయాలైన గణేష్

చౌడేపల్లె, జూలై13: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో పంచాయితీ నిర్వహిస్తుండగానే ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ దాడుల్లో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని కొలింపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు నాగరాజ ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన సావిత్రిమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఆమె తీవ్ర గాయాలాపలై నడుం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై బాధితురాలికి నష్టపరిహారం చెల్లించి కేసు రాజీ చేసుకోవాలని నిర్ణయించారు. పంచాయతీ చేసి సమస్య పరిష్కరించడానికి రాజనాలబండ స్థలాన్ని ఎంపిక చేశారు. బాధితుల వైపు నుంచి వైసీపీ నాయకుడు కొలింపల్లెకు చెందిన ప్రభాకర్ మరికొందరు పెద్ద మనుషులు వచ్చారు. అలాగే టీడీపీకి చెందిన నాగరాజ అతని బంధువు గణేష్, మరికొందరు పెద్ద మనుషులు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు, గ్రామపెద్దలు ఇరువర్గాల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేపట్టారు. ఈక్రమంలో పంచాయతీ పెద్దలు తమకు న్యాయం చేయలేదని ఇరువర్గాల నడుమ మాటామాటా పెరిగింది. అది దాడులకు దారితీసింది. ఈదాడిలో ప్రభాకర్‌కు కాలు విరగగా, గణేష్, నాగరాజకు బలమైన గాయాలయ్యాయి. గాయాలైన వారిని మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాటు కాటుతో ఇద్దరికి అస్వస్థత

పుంగనూరు రూరల్, జూలై13: పొలాల్లో పనిచేస్తున్న ఇద్దరిని పాము కాటేసింది. దీంతో వారు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన శనివారం రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం దాసార్లపల్లెకు చెందిన నారాయణ(50) పొలంలో పనులు చేస్తుండగా పాటు కాటు వేసింది. అదేవిధంగా కేసీపల్లెలో కాపురం ఉన్న జయచంద్ర పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ఇద్దరినీ చుట్టుపక్కల రైతులు గుర్తించి వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూలై13: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన రామసముద్రం మండలంలో శనివారం జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం ఎం. గొల్లపల్లెకు చెందిన మునివెంకటస్వామి కుమారుడు శ్రీనివాసులు(35) కుటుంబకలహాలతో పంటలకు తెచ్చిన పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. కుటుంబసభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కడప మహిళ దారుణహత్య

గొంతుకోసిన గుర్తుతెలియని వ్యక్తి



రెడ్డెమ్మ మృతదేహం

తిరుపతి రూరల్, జూలై 13: కడప జిల్లాకు చెందిన మహిళ ఒకరు తిరుపతిలో దారుణహత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి బాలిరెడ్డి తన భార్య ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ(58), కుమార్తె గుర్రమ్మ(34)తో కలసి బతుకుదెరువు నిమిత్తం సుమారు 30 ఏళ్ల కిందట తిరుపతికి వచ్చారు. గుర్రమ్మకు కంటిచూపు సరిగా కనిపించక పోవడంతోపాటు మానసిక పరిస్థితి సరిగా లేదు. దాదాపు పదేళ్ల కిందట తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో తిరుపతికి చెందిన బి.మాలతికి చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో శ్రీబాలాజి పార్కింగ్ యార్డ్ పేరిట ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేసి వారి వద్దనుంచి ఫీజు వసూలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాలిరెడ్డి తన వృద్ధాప్య పించను తీసుకోవడానికి ఈనెల ఒకటో తేదీన కుమార్తెతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. కుమార్తె ఈనెల 8న తిరుపతికి రాగా, సొంతపనుల నిమిత్తం బాలిరెడ్డి స్వగ్రామంలోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం దాదాపు 5.30గంటల ప్రాంతంలో కుమార్తె స్నానం చేయడానికి వేడినీరు పెట్టడానికి తల్లి రెడ్డెమ్మ సిద్ధమవుతోంది. ఈసమయంలో బ్లూషర్ట్ ధరించి ఉన్న వ్యక్తి గోడదూకి ఇంట్లోకి వచ్చి కుమార్తె గొంతు పట్టుకోవడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తల్లి రావడంతో ఆ వ్యక్తి తన చేతిలో కత్తితో ఆమె గొంతు కోసి గోడదూకి పరారయ్యాడు. కొంతసేపటికి గుర్రమ్మ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం వద్దకొచ్చి తన తల్లి చనిపోయిందని చెప్పింది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదన్న కారణంతో దుకాణ నిర్వాహకురాలు రాధమ్మ పెద్దగా పట్టించుకోలేదు. అయితే గుర్రమ్మ ఏడుస్తూ ఎంతకూ అక్కడినుంచి వెళ్లక పోవడంతో అటుగా వెళుతున్న పారిశుధ్య కార్మికుడికి విషయం చెప్పింది. తర్వాత ముగ్గురూ కలిసి రెడ్డెమ్మ ఇంటికెళ్లారు. గేటు తాళం వేసి ఉండటంతో ఎలా బయటకు వచ్చావని గుర్రమ్మను ప్రశ్నిస్తే.. గేటు ఎక్కి దూకానని చెప్పింది. తాళం ఎక్కడుందని అడిగితే గేటు ఎక్కి లోపలికెళ్లి తీసుకొచ్చింది. గేటు తాళం తీసి ఇంటి లోపలకు చూడగా.. రెడ్డెమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. భయపడ్డవారు వెనక్కి వచ్చేశారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డులకాలనీ వరకు వచ్చి ఆగిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి వస్తువులు బయటపడినట్లు సమాచారం.

అమ్మా చనిపోయింది.. చైనూ ఎత్తుకెళ్లారు

అమ్మా చనిపోయింది.. తన మెడలోని చైనూ ఎత్తుకెళ్లారు అంటూ శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గేటు బయట రోడ్డుపై కూర్చొని విలపిస్తున్న గుర్రమ్మను చూసిన వారంతా కంటతడి పెట్టారు.

భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించండి

టీటీడీ అధికారులతో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న సీఎస్

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నిరీక్షణ సమయాన్ని తగ్గించేదిశగా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులకు ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న ఆయన తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావుతో కలిసి భక్తుల సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మారిన తర్వాత గత నెలరోజుల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు తీసుకున్న నిర్ణయాలు, అమలుచేస్తున్న విధానాలపై సీఎస్‌కు ఈవో వివరించారు.భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు టైం స్లాట్‌సర్వదర్శన టోకెన్ల జారీలో తీసుకోబోతున్న నిర్ణయాలను, ఐటీ విభాగం ద్వారా చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలను ఈవో వివరించారు. తిరుమలలో పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యం, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల్లో నాణ్యత పెంపు కోసం చేస్తున్న మార్పులను సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నిర్ణయాలను అభినందించిన సీఎస్ తిరుమలలో భక్తులకు మంచి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. రోజుకు ఎంతమంది దర్శనానికి వస్తున్నారు, ఎలాంటి దర్శన పద్ధతులున్నాయి వంటి విషయాలపై ఆరా తీశారు. అలాగే సౌకర్యాల కల్పనపై కొన్ని సూచనలు చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కృషి

పుంగనూరు, జూలై13: ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎంపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ ప్రజా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల్లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ప్రజా సంఘాలతో కలసి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రామలింగప్ప, వైవీరమణ, డీసీసీ బ్యాంక్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డెప్ప, శ్రీనివాసులు, చిన్నప్ప, గంగులప్ప, రామకృష్ణ, మునికృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, నారాయణస్వామి, మహేంద్ర పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం



కుప్పం, జూలై 13: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, పీఈఎస్ ఆస్పత్రి సౌజన్యంతో కుప్పంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో పలువురు వృద్ధులు, కంటి జబ్బులతో బాధపడుతున్నవారు పరీక్ష చేయించుకున్నారు. వీరిలో 21 మంది కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ తెలిపారు. పీఈఎస్ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పీజీ.సెల్వం, సోమశేఖర్, సెంథిల్‌కుమార్, చరణ్, ఆజాద్, శివశంకర్, నితిన్ కుమార్, కృష్ణమూర్తి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి విశేష పూజలు

సోమల, జూలై 13: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పుష్పాలంకరణలు జరిపి అభిషేక పూజలు నిర్వహించారు. ఉభయదారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమల, కరకమంద, నడింపల్లె, దిడ్డివారిపల్లె తదితర గ్రామాల భజన సంఘాల సభ్యులు పాల్గొని సంకీర్తలు ఆలపించారు.

లక్ష్మీ నరసింహుడికి ప్రత్యేక పూజలు



కల్లూరు, జూలై 13: పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా చెంగ్రాయులు, వెంకట్రమణ, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, యర్రయ్య, అర్చకులు అనంత కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



పుంగనూరు రూరల్, జూలై13: పట్టణంలోని లయన్స్‌క్లబ్, గురుకులం చెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో 9మంది విద్యార్థులు ప్రతిభ కనబరించారు. శనివారం స్థానిక తూర్పు మొగసాల మున్సిపల్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన చెస్ పోటీల్లో 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో నవ్యశ్రీ, సతీశ్, భరత్‌బాలాజీ, గౌతమ్, లోహితాక్షానాయక్, ప్రణవి, ఉషశ్రీ, భువికీర్తి, ధనుష్‌లు ప్రతిభ కనబర్చారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులు ఈనెల 18న నంద్యాలలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు మణికంఠ తెలిపారు.

పుంగనూరు రోటరీక్లబ్‌కు ప్లాటినం అవార్డులు



అవార్డులు అందుకున్న పుంగనూరు రోటరీక్లబ్ సభ్యులు

పుంగనూరు, జూలై13: పుంగనూరు రోటరీక్లబ్‌కు ప్లాటినం అవార్డులతోపాటు 15 ప్రశంసాపత్రాలను లభించినట్లు ప్రతినిధి రాజారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో రోటరీ గవర్నర్ ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. పుంగనూరు క్లబ్ అందించిన సేవా కార్యక్రమాలను గుర్తించి క్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి రాజారెడ్డిలకు అవార్డులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్లు శరణ్‌కుమార్, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, అర్షద్‌అలీ, హరిప్రసాద్, కిషోర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న గురుపూజోత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బలిజ సంఘనాయకులు

పుంగనూరు, జూలై13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సద్గురు కైవారం నారాయణ స్వామి మఠంలో గురుపూజోత్సవం ఈ నెల 19 నుంచి 21 వరకు జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు ప్రభాకర్ తెలిపారు. శనివారం పుంగనూరులో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ కైవారం నారాయణస్వామి ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పూల త్యాగరాజు, గణేశ్, కుమార్, రామకృష్ణ, రమణ, భాస్కర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురి ఎంపిక



కావ్యశ్రీ, ఝాన్సీహిమగాయత్రి, విద్యా బాయ్

గుడుపల్లె, జూలై 13: మండలంలోని సోడిగానిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన కావ్యశ్రీ, సంగనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఝాన్సీ హిమ గాయత్రి, గుడుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యాబాయ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులను ఎంఈవోలు శ్రీదేవి, లక్ష్మయ్య, హెచ్‌ఎంలు మణి, చిట్టిబాబు, జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

వర్షాలతో టమోటా తోటలకు తెగుళ్లు

సోమల, జూలై 13: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు టమోటా తోటలకు పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయని రైతులు ఆందోళచెందుతున్నారు. మండలంలోని సోమల, నడిం పల్లె, కరకమంద, నెల్లిమంద, ఇరికిపెంట, ఆవులపల్లె తదితర ప్రాంతాల్లో 500 ఎకరాలకు పైగా టమోటా సాగులో ఉంది. ఏప్రిల్, మే నెలల్లో నాట్లు వేసిన టమోటా తోటల్లో దిగు బడులు వస్తున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో టమోటా సాగుకు అధిక పెట్టు బడులు పెట్టాల్సి వస్తోంది. మందుల పిచికారీకే అధిక వ్యయం చేస్తున్నారు. వీటి తోడు దిగుబడులు అంతంత మాత్రమే ఉంటున్నాయి. ప్రస్తుతం కొద్దిరోజులుగా ధరలు రూ.500 నుంచి 700కు చేరుకుంది. ధరలు నిలకడగా ఉండడంతో రైతులు ఆశాజనకంగానే ఉన్నారు. పెట్టుబడులు చేతికందడంతో ఉత్సాహంగానే ఉన్నారు. మరో వైపు ఊజీలతో పంట నష్టం జరుగుతోంది.

టీడీపీ ఫ్లెక్సీలు కాల్చివేత
వైసీపీ నాయకులపై కేసు నమోదు

పుంగనూరు, జూలై13: టీడీపీ ఫ్లెక్సీలు కాల్చివేశారని వైసీపీ నాయకులపై తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని వనమలదిన్నె గ్రామంలోని హైస్కూల్ సమీపంలో తెలుగుదేశం పార్టీ వారు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే గురువారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు విజయ్‌కుమార్, విశ్వనాథ్, శ్రీహరి, డి.వెంకటరమణ, సి.వెంకటరమణ, జి. సూరి, బి.వెంకటేష్, ఎం. వెంకట్రమణ, కె.సుధాకర్, ఆర్‌రెడ్డిప్రసాద్, పి. వెంకటరమణలు ఆ ఫ్లెక్సీలు కాల్చివేశారని టీడీపీ నాయకులు గిరినాయుడు, ప్రసాద్‌స్వామి ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఎస్ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేశారు.

సారా సీజ్.. ఒకరి అరెస్టు

పుంగనూరు రూరల్, జూలై13: సారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్ఐ దామోదర్ కథనం మేరకు.. చౌడేపల్లె మండలం కాటిపేరి పంచాయతీ అగిస్తిగానిపల్లెకు చెందిన వెంకటరెడ్డి 10 లీటర్ల సారాను తరలిస్తుండగా పుంగనూరు మండలం భీమగానిపల్లె క్రాస్ వద్ద పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు.

చంద్రబాబు సీఎం అయ్యారని అయోధ్యలో మొక్కులు చెల్లింపు



గుడుపల్లె, జులై 13: చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గుడుపల్లె మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ భానుమూర్తి అయోధ్యలోని శ్రీరాముడికి మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో శనివారం భానుమూర్తి అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే చంద్రబాబుకు మంచి ఆరోగ్యం అందించాలని శ్రీరాముడిని వేడుకున్నట్లు ఆయన తెలియజేశారు.

తిరుమల పాదయాత్రికులకు అల్పాహారం



పలమనేరు, జూలై13: కర్ణాటక నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్తూ మార్గమధ్యంలోని పలమనేరులో సేదతీరుతున్న యాత్రికులకు స్థానిక సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు అల్పాహారాన్ని అందజేశారు.

మార్కెట్‌యార్డులో బురద, వ్యర్థాల తొలగింపు



పలమనేరు, జూలై13 స్థానిక మార్కెట్ యార్డులో శనివారం వర్షానికి పేరుకుపోయిన బురదతో పాటు టమోటా వ్యర్థాలను ఎక్సకవేటర్ ద్వారా తొలగించారు. యార్డులో బురద, టమోటా వ్యర్థాల వలన రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన మార్కెట్ యార్డు కార్యదర్శి సంజీవకుమార్ ఎక్సకవేటర్‌ను తెప్పించి మార్కెట్‌యార్డును శుభ్రంచేయించారు. అలాగే బ్లీచింగ్ చల్లించారు.

ఇప్పటికైనా ఆదుకోండి..!

- మూడేళ్ల క్రితం కౌండిన్య ప్రవాహంతో మునిగిన పంటలు
- రాళ్లుతేలిన పొలాలు
- పట్టించుకోని అధికారులు, అప్పటి పాలకులు





ముసలిమడుగు వద్ద పొలాలపై ప్రవహించిన కౌండిన్య నదీజలాలు

పలమనేరు, జూలై13 : మూడేళ్లక్రితం కురిసిన భారీ వర్షాలకు కౌండిన్య నదీ ప్రవాహంతో తీవ్రంగా నష్టపోయిన తమను ఇప్పటి ప్రభుత్వం అయినా ఆదుకోవాలని మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. పలమనేరు, గంగవరం మండలాల్లో దాదాపు 10 కిలో మీటర్లకు పైగా కౌండిన్య నది ప్రవహిస్తోంది. ఈ దనీ పరీవాహక ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయ బావులు, బోర్లలో నీరు సమృద్ధిగా ఉండేందుకు కౌండిన్య నదిపై అక్కడక్కడా చెక్‌డ్యాంలు నిర్మించారు. ఇలా నిర్మించిన చెక్‌డ్యామ్‌లలో భాగంగా ముసలిమడుగు గ్రామం వద్ద కూడా కౌండిన్యనదిపై ఒక చెక్‌డ్యామ్ నిర్మించారు. ఆరేళ్ల క్రితం అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఈ చెక్‌డ్యామ్‌లో మరింత నీరు నిలిచేందుకు వీలుగా డ్యామ్ ఎత్తును దాదాపు ఒకటిన్నర అడుగులకు పైగా పెంచారు. అయితే డ్యామ్‌కు ఇరువైపులా నీరు పొంగి ప్రవహించకుండా రివిట్‌మెంట్ కట్టలేదు. ఫలితంగా మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా కౌండిన్య నది ఉధృతంగా ప్రవహించింది. ఆ సమయంలో డ్యామ్‌కు ఇరువైపులా రివిట్‌మెట్‌వాల్ లేకపోవడంతో నీరు పొలాలపై పడింది. పొలాలు తీవ్ర కోతకు గురయ్యాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రైతులు పంటలు, భూముల కోతతో భారీగా నష్టపోయారు. అప్పట్లో పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీఇచ్చారు. తర్వాత మరిచి పోయారు. రెండేళ్ల క్రితం గ్రామానికి వచ్చిన అప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడను కూడా రైతులు కలిసి తమకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వమైనా చెక్‌డ్యామ్‌కు ఇరువైపులా రివిట్‌మెంట్ వాల్ నిర్మించడంతో పాటు మళ్లీ తమ పొలాలను బాగుచేసుకొనేందుకు తగిన సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు.



కోతకు గురై రాళ్లుతేలి పొలంలో ఏర్పడిన భారీ గుంతలు

అందుబాటులో బియ్యం ధరలు : డీఎస్‌వో శంకరన్

- కల్లూరులో 4 బియ్యం విక్రయ కేంద్రాలు ప్రారంభం



బియ్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ఓ శంకరన్

కల్లూరు, జూలై 13: ప్రజలకు నాణ్యమైన బియ్యం, వాటి ధరలు అందుబాటులో ఉండేలా రైస్ మర్చంట్ అసోసియేషన్ కృషిచేయాలని డీఎస్‌వో (జిల్లా పౌరసరఫరాల అధికారి) శంకరన్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో శనివారం బియ్యం ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ నిత్యావసర ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వం బియ్యం, కందిపప్పును తక్కువ ధరలకు అందజేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. బియ్యం కిలో రూ.48కే విక్రయించాలని సూచించారు. బియ్యం కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీధర్ నాయుడు, అనీల్, నూర్‌బాషా, కరుణాకర్ నాయుడు, ఖాదర్‌వల్లి, అబ్బాస్, అష్రఫ్, ఈఎం రత్నం, నాసిర్, పురుషోత్తం నాయుడు, రమేష్, సుబ్రమణ్యం, రైస్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు విజయ్‌కుమార్, సత్యకిరణ్, రెడ్డి విజయ్‌కుమార్, నరసింహులు, మువ్వలశేఖర్, బీఆర్ శేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ వీరాభిమాని సంపూర్ణమ్మ మృతి



సంపూర్ణమ్మ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆనందరెడ్డి (ఇన్‌సెట్లో) సంపూర్ణమ్మ (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, జూలై 13: రామకుప్పం మండలం బందార్లపల్లెకు చెందిన టీడీపీ వీరాభిమాని సంపూర్ణమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. 1989 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు తొలిసారి కుప్పం నియోజకవర్గం నుంచి పోటీ చేసి బందార్లపల్లెకు ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఆ సమయంలో సంపూర్ణమ్మ ఆయనకు వీరతిలకం దిద్ది అభిమానాన్ని చాటుకుంది. ఆమె వీర తిలకం దిద్దుతున్న నిలువెత్తు కటౌట్‌ను అప్పట్లో హైదరాబాదు టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. అదేవిధంగా మహిళలకు పంచిన కరపత్రాల్లోనూ ఆ ఫొటోనే ప్రముఖంగా వాడారు. సంపూర్ణమ్మ మృతి పట్ల మండల టీడీపీ నేతలు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, బూత్ కన్వీనర్లు బాలరాజు, మంజునాథ్, చలపతి, నేతలు టీవీరవి, అల్లి శీన, మునిరెడ్డి, ఆనందరెడ్డి, శ్రీకాంత్, ఆంజి, హీరాబాషాలు శనివారం ఉదయం సంపూర్ణమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

వీధికుక్కల దాడిలో రెండు పొట్టేళ్ల మృతి



మృతిచెందిన పొట్టేళ్లవద్ద దిగాలుగా కూర్చున్న పద్మమ్మ

బైరెడ్డిపల్లె, జూలై 13 : మండలంలోని మిట్టకురప్పల్లె గ్రామంలో శనివారం సాయంత్రం వీధికుక్కలు దాడిచేసి రెండు పొట్టేళ్లను చంపేశాయి. పద్మమ్మ తన రెండు పొట్టేళ్ల గ్రామసమీపంలో పొలం వద్ద మేతకు వదిలింది. దాదాపు ఆరు వీధి కుక్కలు అకస్మాత్తుగా పొట్టేళ్లపై దాడిచేసి చంపేశాయి. వాటి విలువ రూ.40 వేల వరకు ఉంటుంది. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని పద్మమ్మ కోరారు.

బైరెడ్డిపల్లెలో వీధికుక్కల బెడద

బైరెడ్డిపల్లెలో గతకొన్ని రోజులుగా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. అన్నివీధుల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా ఏర్పడి దారిలో వచ్చిపోయేవారిపై విరుచుకుపడుతున్నాయి. కుక్కల భయంతో జనం ఒంటరిగా వెళ్లాలంటేనే హడలి పోతున్నారు. ఇప్పటికే పలువురు కుక్క కాటుకు గురై ఆస్పత్రుల్లో చికిత్సపొందారు. కుక్కల భయంతో పిల్లలను బయట ఆడుకోవడానికి పంపడానికి కూడా తల్లిదండ్రులు జంకుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలబెడద నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగు భాషాభివృద్ధికి సమష్టి కృషి అవసరం



ఎంపీ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సమితి సభ్యులు

గంగవరం, జూలై 13: తెలుగు భాషాభివృద్ధికి సమిష్టిగా కృషిచేయాల్సిన అవసరం మనందరిపై ఉందని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన గంగవరంలోని కళామందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషల రక్షణకు పార్లమెంట్ వేదికగా తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తెలుగు భాష గొప్పతనం, ఔన్నత్యాన్ని భావితరాలకు అందించడానికి తెలుగుసాహిత్య సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్పలు ఎంపీని ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు గురుమూర్తి, ఉమ, పూసల రవి, శ్రావణి, గిరి గీతాంజలి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్



తన కుటుంబసభ్యులపై ఉన్న కేసుల వివరాలను చంద్రబాబుకు తెలుపుతున్న జయశంకర్

రామకుప్పం, జూలై 13: రామకుప్పం మండలానికి చెందిన టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్ శనివారం మంగళగిరిలో సీఎం చంద్రబాబును కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు తన కుటుంబసభ్యులపై బనాయించిన తప్పుడు కేసుల గురించి సీఎంకు వివరించానని జయశంకర్ తెలిపారు. అదేవిధంగా తన భార్య మహాదేవి సర్పంచుగా ఉన్న 2013-2019 కాలంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులను కక్షపూరితంగా నిలిపేశారని, తమ హాలోబ్రిక్స్ తయారీ కేంద్రాన్ని మూసివేయించారని వివరించినట్లు చెప్పారు. తనపై, తన కుటుంబసభ్యులపై తప్పుడు కేసులు నమోదు చేయడమే కాకుండా దూషణలతో వేధించిన అప్పటి డీఎస్పీ, సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని విన్నవించానన్నారు. న్యాయం చేస్తానని సీఎం హామీ ఇచ్చారని జయశంకర్ తెలిపారు.

చెరువుల్లో మట్టి మాయం



నక్కపల్లి చెరువులో మట్టితరలిస్తున్న దృశ్యం

పలమనేరు, జూలై13 : పలమనేరు మండలంలో కొన్ని రోజులుగా మట్టిమాఫియా చెలరేగిపోతోంది. పలమనేరు, గంగవరం మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేస్తున్న వెంచర్ల చదును కోసం ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఇప్పటికే పలమనేరు సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సమీపంలోని చెరువుల్లో వేలాది టిప్పర్లతో మట్టిని తరలించారు. దీంతో చెరువులు ఆనవాళ్లు కోల్పోయాయి. భారీగుంతలు ఏర్పడ్డాయి. చెరువులు నిండినా తమ పొలాలకు నీరు అందే అవకాశం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టపగలే ఎక్సకవేటర్లతో మట్టిని తరలించుకుపోతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇక భూగర్భవనరులు శాఖ కార్యాలయం పలమనేరులో ఉన్నా వారు పట్టించుకోవడం ఎప్పుడో మానేశారు. ఇకనైనా అధికారులు స్పందించి చెరువుల్లో అక్రమ మట్టి తరలింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

పుంగనూరు రూరల్, జూలై13: పుంగనూరు మండలం మార్లపల్లెకు వెళ్లే మార్గంలో రోడ్లు గుంతలు పడి కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. రాత్రి పూట ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్రవాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. అలాగే సైకిళ్లపై పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.





పుంగనూరు- మార్లపల్లె మార్గంలో గుంతలు పడ్డ రోడ్లు

భూ సమస్యల పరిష్కారానికి కృషి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

కల్లూరు, జూలై 13: భూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరుకి చెందిన రైతు ముస్తాక్ అహ్మద్ తన వ్యవసాయ భూమిని వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్చేందుకు అధికారులకు దరఖాస్తు చేసుకోవడంతో ఆ భూమిని, దానికి సంబంధించిన రికార్డులను శనివారం ఆర్డీఓ పరిశీలించారు. భూమికి సంబంధించిన వివరాలను రైతు ముస్తాక్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



గల్లా రామచంద్రకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), జూలై 13: స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో అమరరాజ గ్రూప్స్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు, ఆయన మనవడు, సినీ హీరో గల్లా అశోక్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఉన్నారు. వారిని ఏఈవో హరిమాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక మంత్రికి సన్మానం



పూతలపట్టు, జూలై 13: రాష్ట్ర పర్యాటక, సినీ ఆటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ శనివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని దుశ్శాలువతో సన్మానించి, నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. కాణిపాకం ఆలయ అభివృద్ధి పనులపై చర్చించడంతో పాటు నియోజకవర్గంలోని ఐరాల, మొగిలి ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే భానును కలిసిన టీడీపీ నేతలు



ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు

విజయపురం, జూలై 13: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మండలానికి చెందిన టీడీపీ నాయకులు తిరుపతిలో ని ఆయన స్వగృహంలో శనివారం మర్యాద పూ ర్వకంగా కలిశారు. గ్రా మాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి గురించి చర్చించినట్టు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు చంద్రయ్య, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరి మాతమ్మ ఆలయానికి విరాళం



నటి కేఆర్ విజయ చేతుల మీదుగా విరాళం అందుకుంటున్న నగరి ఆది ఆంధ్రులు

నగరి, జూలై 13: నగరి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో వెలసిన మాతమ్మ ఆలయానికి ఉత్సవ దీపాన్ని, రూ.30 వేల నగదును అందించారు. నగరి ఆది ఆంధ్రవాడలో జరుగుతున్న మాతమ్మ తిరుణాళ్ల సందర్భంగా నగరి టీడీపీ నేత రామానుజం చలపతి మాతమ్మ దేవాలయానికి వితరణగా ఇచ్చిన ఉత్సవ దీపం, రూ.30 వేల నగదును సినీనటి కేఆర్ విజయ చేతులమీదుగా శనివారం ఆది ఆంధ్రవాడవాసులు అక్కమ్మ, ఆదెమ్మ అయ్యప్ప పాండు తదితరులకు అందించారు.

కూలేందుకు సిద్ధంగా చింతచెట్టు



పెనుమూరు, జూలై 13: పెనుమూరు - చిత్తూరు మార్గంలో పెద్ద రాజుపల్లి గ్రామం వద్ద రోడ్డుపక్కన పెద్ద చింత చెట్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ చెట్టును తొలగించకపోతే పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడి రోడ్డుపై పడే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జూలై 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన ఉమామహేష్ రూ.1,00,000ను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. దాతకు ఆలయ సంప్రదాయం ప్రకారం సూపరింటెండెంట్ వాసు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

నిరాశ్రయులకు ఉచిత టీకా



ఉచిత టీకాలు వేస్తున్న వైద్యులు

చిత్తూరు కల్చరల్, జూలై 13: నగరపాలక, సపోర్ట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల కేంద్రంలో శనివారం 60 సంవత్సరాల వయసు దాటిన వారికి ఉచితంగా బీసీజీ టీకాలను వైద్యులు వేశారు. సంస్థ నిర్వాహకులు జోసఫ్‌రాజు మాట్లాడుతూ బీసీజీ టీకా వలన వృద్ధులు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. వసతి గృహం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఉపాధ్యక్షుడిగా
పార్థివశెట్టి నియామకం



కార్వేటినగరం, జూలై 13: కొల్లగుంటకు చెందిన పార్థివశెట్టిని బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర యువ మోర్చా మార్కెట్ యార్డు కో కన్వీనర్ యువరాజు శనివారం తెలిపారు. మండలంలో బీజేపీని పటిష్ఠం చేయడానికి తన వంతు కృషి చేస్తానని పార్థివశెట్టి పేర్కొన్నారు.

జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ





మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, డీఈవో కార్యాలయం ముందు యూటీఎఫ్ నాయకుల నిరసన

చిత్తూరు (సెంట్రల్), జూలై 13: గత ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి గ్యారెంటీ పెన్షన్ స్కీం పేరిట అమలులోకి తెచ్చిన చట్టంపై ప్రస్తుత ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడాన్ని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక ఆపస్ కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పలు పోరాటాలు చేసినా, గత ప్రభుత్వం 2023 అక్టోబర్ 20న జీపీఎస్‌ను అమలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఏడాది కాలంలో జీపీఎస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రకటించినా, తాజాగా జీపీఎస్ అమలుపై గెజిట్ విడుదల చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి విజయ్, దొరస్వామి, రాధాకృష్ణ, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి: యూటీఎఫ్

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీపీఎస్ అమలు చేస్తూ జీవో విడుదల చేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం డీఈవో కార్యాలయం ముందు జీవో ప్రతులను దగ్ధం చేశారు. నాయకులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. నిరసనలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, సహాధ్యక్షులు రహనాబేగం, కార్యదర్శులు రెడ్డప్ప, సరిత, పార్థసారథి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా పాలసముద్రం

పాలసముద్రం, జూలై 13: పాలసముద్రం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉండటం వల్ల ఇసుక వ్యాపారానికి ఇక్కడ అడ్డాగా మారింది. గత వారం రోజులుగా గంగాధరనెల్లూరు మండలం నుంచి పాలసముద్రం మీదుగా తమిళనాడుకు రాత్రిపూట టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి స్మగ్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఐదురోజుల క్రితం తమిళనాడుకు తరలించే 10వీలర్ టిప్పర్‌ను మండల టీడీపీ నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రెండ్రోజుల క్రితం తమిళనాడులోని ఆర్కేపేట పోలీసులు తమిళనాడుకు అక్రమంగా వచ్చే ఇసుక టిప్పర్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించగా, డ్రైవర్ టిప్పర్‌ను వదిలి పెట్టి పారిపోయాడు. తమిళనాడు పోలీసులు టిప్పర్‌ను పాలసముద్రం పోలీసులకు అప్పగించారు. రెండు సంఘటనలపైన పాలసముద్రం ఎస్‌ఐ భారతి కేసులు నమోదు చేశారు. తమిళనాడుకు రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దీనబంధుపురం, నరసింహాపురం ప్రాంతాల నుంచి తమిళనాడుకు అడ్డదారుల్లో ఇసుకను తరలించిస్మగ్లర్లు సొమ్ముచేసుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలెక్టరేట్ ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ



చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 35 మంది ఆఫీస్ సబార్డినేట్‌లకు శనివారం జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య యూనిఫాం దుస్తులు అందజేశారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈకార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి హుస్సేన్, కలెక్టరేట్ యూనిట్ సభ్యులు పార్థసారథి, హేమాద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి
సమావేశం నిర్వహించాలి: ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న గంటా మోహన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 13: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, గంటా మోహన్‌లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. రఘునాథరెడ్డి మాట్లాడుతూ అసంబద్ధమై 117 జీవోను రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ పట్ల చిత్తశుద్ధిని చాటాలని కోరారు. ఎస్టీయూ నాయకులు హేమచంద్ర, శ్రీదేవి, జగన్మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, జనార్థన్, మోహన్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి చిత్రపటం ఊరేగింపు



పూతలపట్టు, జూలై 13: మండల కేంద్రమైన పూతలపట్టు పుర వీధుల్లో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి చిత్రపటాన్ని శనివారం ఊరేగించారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నాదస్వర కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళానిధి నాటక అకాడమీ యువ పురస్కార్ అవార్డు గ్రహీత విజయ్ కార్తికేయన్, ప్రకాష్ ఇళయరాజ, వి.ఎం.గణపతి, కేపీ మనోహర్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివానందం సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరణిని కల్సిన టీడీపీ, జనసేన నాయకులు



బంగారుపాళ్యం, జూలై 13: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును చిత్తూరులోని ఆయన స్వగృహంలో శనివారం మండలానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ కళావతి, మహేంద్ర, జనసేన మండల అధ్యక్షుడు కోడి చంద్రయ్య, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి, భాస్కర్ నాయుడు, వేణు, గురుస్వామి, నాగరాజు, తోట శ్రీహరి తదితరులు ఉన్నారు.

పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించండి

గుడిపాల, జూలై 13: మండలంలోని ఏఎల్‌పురం సమీపంలో వున్న పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కోరారు. చిత్తూరులో శనివారం ఆయనను కలిసి పాళ్యంకొండ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. పాళ్యంకొండ ఆలయ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్, కమిటీ సభ్యులు రాజగోపాల్ నాయుడు, హేమాద్రి, రాజు, రమేష్, డిల్లీబాబు, కోటేశ్వరరావు, నాగేష్, భూపాల్ నాయుడు, యోగానందం, వెంకటేశులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ సర్పంచ్ రవి నాయుడు, సాంబశివ నాయుడు, విజయ్, గోపి, రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి బొమ్మసముద్రం విద్యార్థుల ఎంపిక

గుడిపాల, జూలై 13: మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదుమంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతికి చెందిన సోఫియా, త్రిష, లోకేష్, ప్రవీణ్‌కుమార్, భవ్యలు ట్రిపుల్ ఐటీకి ఎంపికకావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు గణపతి, రామ్‌నాయక్ అభినందించారు.

విజయపురం: ట్రిపుల్ ఐటీకి మండలంలోని పాతార్కాడుకు చెందిన విద్యార్థిని జశ్విత ఎంపికైంది. ఈ విద్యార్థిని విజయపురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి మండల టాపర్‌గా నిలిచింది. ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తవణంపల్లె: **మండలంలోని అరగొండ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత** పాఠశాల విద్యార్థిని హిందుమతి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఈశ్వర్‌శెట్టి తెలిపారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు హిందుమతిని అభినందించారు.

చిత్తూరు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- **సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు**



చిత్తూరు రూరల్, జూలై 13: చిత్తూరు నగరపాలక సంస్థలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్న కమిషనర్ అరుణను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కమిషనర్ సొంత పనులకు దొంగ బిల్లులు పెట్టి నగరపాలక సంస్థ డబ్బులు లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మీడియా ద్వారా కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు. అవినీతి అధికారిణిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బదిలీ కాకుండా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోనిపక్షంలో సీపీఐ, ప్రజాసంఘాల తరపున నిరసనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

టైలర్ సంఘం సమావేశాన్ని జయప్రదం చేయండి

నగరి, జూలై 13: నగరి పట్టణంలోని విశ్వం కోచింగ్‌సెంటర్‌లో ఈనెల 24వతేదిన జరిగే టైలర్ల సంఘ సమావేశానికి టైలర్లందరూ హాజరు కావాలని ఆ సంఘం కార్యదర్శి వీరయ్య తెలిపారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సలహాకమిటీ, సమన్వయకమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

16, 17 తేదీల్లో మొహర్రం పండుగ

చిత్తూరు కల్చరల్, జూలై 13: నగరంలో ఈనెల 16, 17 తేదీల్లో ముస్లింల పవిత్రమైన మొహర్రం (పీర్ల) పండుగను జరుపుకోనున్నారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వాస్పత్రి సమీపంలో పీర్ల మకాన్‌లో శాస్త్రోక్తంగా పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 16వతేది మంగళవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం, 17న పీర్లకు జలాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

తవణంపల్లె, జూలై 13: మండలంలోని రౌడీ షీటర్లకు స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఎస్ఐ అనిల్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం మార్పులో భాగంగా రాజకీయ పార్టీలతో సంబంధాలు నడిపి ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడినా, ఇతరులపై ఆధిపత్యం చెలాయించడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్, జిల్లా బహిష్కరణ వంటి చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

కిల్కారి యాప్‌పై అవగాహన కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు

పాలసముద్రం, జూలై 13: మండలంలోని గర్భిణులు, బాలింతలకు మాతా, శిశు మరణాల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా కిల్కారి యాప్‌ను ప్రవేశపెట్టిందని రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి పేర్కొన్నారు. శనివారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బందికి కిల్కారి యాప్ గురించి ఆమె అవగాహన కల్పించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లోకేష్, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి పాలాభిషేకం



వెదురుకుప్పం, జూలై 13: మండలంలోని దేవరగుడిపల్లె - ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం పాలాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కార్తీక్ అయ్యంగార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్ధంతరంగా ఆగిన రోడ్డు పనులు

అవస్థల్లో వాహనదారులు

పెనుమూరు, జూలై 13: ఎన్నికల ముందు పెనుమూరు నుంచి పెనుమూరు క్రాస్ వరకు నూతన రోడ్డు పనులను ఓ కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వచ్చాక పనులు తాత్కాలికంగా నిలిపేశారు. అప్పటికే కొన్ని చోట్ల పనులు ప్రారంభించారు. శాతంభాకం గంగుపల్లి చెరువు వద్ద కొంత దూరం మేర సగం రోడ్డును ఎక్సకవేటర్‌తో తొలగించారు. అలాగే ఉగ్రాణంపల్లి సమీపంలోని నివాసాల వద్ద వేసిన సిమెంటు రోడ్డుకు, తారు రోడ్డుకు మధ్య ఎత్తుపల్లాలు ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. దీంతో వర్షం పడినప్పుడల్లా అక్కడ గుంతల్లో పూర్తిగా నీరు నిలచిపోవడంతో వాహనదారులు పడి లేచి వెళ్తున్నారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం వచ్చి కూడా నెల పూర్తయినా మళ్లీ రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.





ఉగ్రాణంపల్లి వద్ద బురదమయం

శాతంభాకం వద్ద రోడ్డు దుస్థితి